క్లుప్తంగా

13న ఉద్యోగ మేళా

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 13వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. ప్రముఖ అరబిందో ఫార్మా కంపెనీతో పాటు మరో 15 కంపెనీల ప్రతినిధులు ఈ మేళాకు హాజరై, తమ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటారన్నారు. డిగ్రీ, ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులంతా తమ సర్టిఫికెట్ల ఒరిజినల్, జిరాక్స్ కాపీలతో హాజరుకావచ్చన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ఐసీడీఎస్, వైద్యారోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఐసీడీఎస్, వైద్యారోగ్య సిబ్బందితో సోమవారం సమావేశమైన ఆమె.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిశోరి బాలికల్లో రక్తహీనత సమస్య ఏర్పడకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కేకే సాగరవర్మ మాట్లాడుతూ పౌష్టికాహార వినియోగంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడలో గజరాజుల గుంపు



దంగభద్ర అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: మండల ప్రజలకు గజరాజుల బెడద పట్టుకుంది. పార్వతీపురం మండలంలోని పలు గ్రామాల్లో గత కొన్నాళ్లుగా సంచరించి, బీభత్సం సృష్టించిన ఏనుగుల గుంపు ఇప్పుడు కొమరాడ మండలానికి చేరుకుంది. ప్రస్తుతం దంగభద్ర, కందివలస తదితర గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తుండడంతో ఆ ప్రాంత ప్రజలతో పాటు కుమ్మరిగుంట, కందివలస, గంగారేగువలస తదితర గ్రామాల్లో కూరగాయల సాగు చేస్తున్న రైతులంతా తీవ్ర భయాందోళన వ్యక్తం చేశారు. ఏ క్షణాన తమ ప్రాంతం వైపు వచ్చి, పంటను నాశనం చేస్తాయోనని భయపడుతున్నారు. కోసిన వరిచేను కూడా పొలాల్లోనే ఉండిపోయిందని వరి సాగు రైతులు కూడా భయాందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి, ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, రైతులెవరూ పంట పొలాలకు వెళ్లొద్దని అటవీ శాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి



అబుల్ కలాం విశిష్టతను వివరిస్తున్న ప్రిన్స్‌పాల్ శ్యాంబాబు

పాలకొండ రూరల్: భారతరత్న అవార్డు గ్రహీత మౌలానా అబుల్‌కలాం ఆజాద్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం.శ్యాంబాబు అన్నారు. కళాశాల ఆవరణలో జాతీయ విద్యాదినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ఆజాద్ జన్మదినం రోజున జాతీయ విద్యాదినోత్సవంగా ఎందుకు జరుపుకుంటున్నామో వివరించారు. దేశంలో తొలి విద్యాశాఖా మంత్రిగా ఆయన విద్యాభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారు. అంతకు ముందు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

అంకితభావంతో విధులు నిర్వహించాలి

- డీఎస్పీ రాంబాబు



సబ్‌జైలును పరిశీలిస్తున్న డీఎస్పీ రాంబాబు

పాలకొండ రూరల్: సబ్ జైల్ సిబ్బంది విధి నిర్వహణలో అంకితభావం కనబరచాలని పాలకొండ సబ్ డివిజన్ పోలీస్ అధికారి ఎం.రాంబాబు అన్నారు. సోమవారం స్థానిక సబ్ జైలును ఆకస్మికంగా సందర్శించి, ఖైదీలకు అందుబాటులో ఉన్న వసతులపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరును జైల్ సూపరింటిండెంట్ బి.జోగులును అడిగి తెలుసుకున్నారు. ఖైదీల ఆరోగ్య భద్రతపై, పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని అధికారులను సూచించారు. ఈయన వెంట హెడ్ వార్డర్స్ పి.చంద్రరావు, బి.విజయ్‌కుమార్, ఏఎస్సై శ్రీనివాసరావు, నాగరాజు, నరసింహమూర్తి, తదితరులున్నారు.

● జీఓ 3 పునరుద్ధరించాలి..



షెడ్యూల్ ఏరియాలో జీఓ నంబర్ 3 పునరుద్ధరించాలని ఆదివాసీ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. శ్రీనివాసరావు, సవర చిరంజీవులు కోరారు. ఈ మేరకు ఐటీడీఏ కార్యాలయంలో పీఓ సి. యశ్వంత్‌కుమార్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వందశాతం ఉద్యోగ నియామకాలు ఏజెన్సీలోని గిరిజనులతో చేపట్టడం, స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పొందుపరిచారు. కార్యక్రమంలో నాయకులు బి.ఉమామహేశ్వరరావు, రామ్మోహనరావు, ఎస్.మోహన్‌పాల్, కె.భాస్కరరావు, ఎం.విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు. – సీతంపేట

● పీహెచ్‌సీల సందర్శన..



సీతంపేట మండలంలోని పలు పీహెచ్‌సీలను వైద్యారోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్ సోమవారం సందర్శించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మౌలిక వసతులు, రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజు వారీ ఓపీ వివరాలు తెలుసుకున్నారు. అన్నిరకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయా..? ఇంకా ఏమైనా అవసరమా.. వైద్య పరికరాలు, రక్త పరీక్షల కిట్లు, తదితర అంశాలపై ఆరా తీశారు. – సీతంపేట

● పనిభారం తగ్గించాలని డిమాండ్



పనిభారం తగ్గించాలని గరుగుబిల్లి మండలంలోని వీఆర్‌వోలంతా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని తహసీల్దారు పి.బాలకు సోమవారం వినతిపత్రం అందజేశారు. వీఆర్‌వోల సంఘ అధ్యక్షుడు ఎస్.ధనుంజయరావు మాట్లాడుతూ ఓ వైపు సీటిసంఘాల ఎన్నిలకు సంబంధించి ఓటర్ల జాబితా తయారీ, రీసర్వేకు సంబంధించి, గ్రామాల్లో గ్రామసభలు, ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం వంటివి నిర్వహించడంతో పాటు పింఛన్ల పంపిణీ కూడా పాల్గొంటున్నామన్నారు. రెవెన్యూ కార్యకలాపాలతో పాటు ఇతర శాఖల విధులను కూడా నిర్వహించడంతో పనిభారం రోజురోజుకూ పెరుగుతోందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి, పనిభారాన్ని తగ్గించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. –గరుగుబిల్లి

పగలు ఎండ... రాత్రి చలి

- తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు
- పొగమంచుతో జరభద్రం
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



సీతంపేట: ప్రధాన రహదారిపై ఉదయం కురుస్తున్న పొగమంచు

పాలకొండ రూరల్/సీతంపేట: పగటి పూట ఎండ ... సాయంత్రం నుంచి వేకువజాము వరకు చలి పంజా విసురుతోంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు విపరీతంగా కురుస్తోంది. దీంతో అన్ని వర్గాల ప్రజలూ ఇబ్బంది పడుతున్నారు. ఏజెన్సీ విస్తరించి ఉన్న నియోజకవర్గంలో దీపావళి పండగ నుంచి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఈ చల్లని వాతావరణంలో పలు వ్యాధులకు కారణమయ్యే వైరస్‌లు వ్యాపిస్తున్నాయి. గడిచిన వారంలో నియోజకవర్గంలో చలి తీవ్రత పెరుగుతూ వస్తోంది. దీంతో అటు అధికారులు, ఇటు ప్రజలు అప్రమత్తమయ్యారు. చలి వల్ల ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు రోగాల బారినపడుతున్నారు. రక్షణ కొరకు రగ్గులు, స్వెట్టర్లను ఆశ్రయిస్తున్నారు.

రుగ్గులు.... స్వెట్టర్లకు గిరాకీ....

చలి తీవ్రత నుంచి రక్షణ పొందేందుకు అన్నివర్గాల ప్రజలు రగ్గులు, స్వెట్టర్లను వినియోగిస్తున్నారు. దీంతో వీటి అమ్మకాలకు గిరాకీ పెరిగింది. స్వెట్టర్లు రూ.300ల నుంచి వెయ్యి వరకు ధర పలుకుతుండగా.. రగ్గులు రూ.400ల నుంచి వాటి నాణ్యతను బట్టి ధరలున్నాయి. వీటి అమ్మకాలు ఊపందుకోవడంతో రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు స్థానికంగా స్టాల్స్ ఏర్పాటు చేసుకుని విక్రయాలు చేపడుతున్నారు. పట్టణంలో నాగవంశపు వీధి, యాలాం కూడలి, పాత ఆంధ్రాబ్యాంక్, కోటదుర్గమ్మ దేవస్థానం సమీపంలో ఈ స్టాళ్లు వెలిశాయి.

చలి మాటున వ్యాధులు...

వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులకు తోడు వ్యాధులు భయం పొంచి ఉంది. ముఖ్యంగా చల్లని వాతావరణంలో వైరస్‌లు అధికంగా విజృంభిస్తాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తతే శ్రీరామరక్షని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా జలుబు, దగ్గు, శ్వాస సంబధిత వ్యాధులు, వైరల్ జ్వరాలు వృద్ధులు, చిన్నపిల్లలను పట్టి పీడిస్తాయి. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేవారు మాస్క్‌లు ధరించాలని చెబుతున్నారు.



పాలకొండ రూరల్: తెల్లవారుజామున పాలకొండ పట్టణంలో కురుస్తున్న మంచు



పాలకొండలో స్వెట్టర్లు, రగ్గుల దుకాణం

రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం..

పొగమంచు విపరీతంగా కురుస్తున్న నేపథ్యంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది. దీంతో వాహన చోదకులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉందని పలువురు చెబుతున్నారు. రహదారుల పక్కన, మలుపుల వద్ద నిలిచి ఉన్న వాహనాలను గమనిస్తూ వెళ్లాలి. పొగమంచు కురుస్తున్న నేపథ్యంలో లైట్లు వేసుకుని రాకపోకలు సాగించడంతో పాటు నెమ్మదిగా వెళ్లడం మంచిదని పోలీస్, రవాణా అధికారులు చెబుతున్నారు.

అతివేగం తగదు..



వాహనదారులు నెమ్మదిగా రాకపోకలు సాగించడం మేలు. మంచు దట్టంగా కురుస్తున్న నేపథ్యంలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించడంతో పాటు లైట్లు వేసుకుని ప్రయాణించాలి.

– ఎం. రాంబాబు, డీఎస్పీ

వాతావరణంలో మార్పులు..



గడిచిన వారం రోజులుగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చల్లని గాలులతో పాటు కురుస్తున్న మంచు వల్ల శ్వాస సంబంధిత, వైరల్ జ్వరాలు విజృంభిస్తాయి. పిల్లలు, వృద్ధులు వెచ్చటి వాతావరణంలో ఉండాలి.

– జి. మోహనరావు, విశ్రాంత ఉద్యోగి, పాలకొండ

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు సాంబమూర్తి

కొమరాడ: మండలంలోని ఉలిపిరి గిరిజన ఆశ్రమ పాఠశాల, వసతిగృహం అవినీతి, అక్రమాలపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని విలేకరులతో సోమవారం మాట్లాడిన ఆయన.. ఉలిపిరి ఆశ్రమ పాఠశాల వివాదాలు, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని విమర్శించారు. జీసీసీ కార్యాలయం నుంచి నేరుగా ఉలిపిరి వసతిగృహానికి రావాల్సిన బియ్యం.. విక్రంపురంలోని ఓ ఇంట్లో ఉండగా అక్రమంగా దాచి ఉంచిన 17.5 క్వింటాళ్ల బియ్యాన్ని రెవెన్యూ అధికారులే పట్టుకున్నారన్నారు. ఆ ఘటనపై గిరిజన సంక్షేమ అధికారులు తూతూమంత్రంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారని, అలా కాకుండా కలెక్టర్ ఈ వసతిగృహం బాగోతంపై ప్రత్యేక దృష్టిసారించి పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకుడు రామరావు పాల్గొన్నారు.

నేడు పీవోఏ చట్టాలపై వర్క్‌షాప్

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలో పీవోఏ(ఎస్సీ, ఎస్టీ) చట్టాలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ పి.నారాయణరావు ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. క్రైమ్ ఇన్విస్టిగేషన్ విభాగం ఆధ్వర్యంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ వర్క్‌షాప్ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పక్కాగా పశుగణన..



వెలగవాడలో పశుగణన కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎ.డి మాణిక్యాలరావు

పాలకొండ: పాలకొండ డివిజన్ పరిధిలో పశుగణన పక్కాగా చేపడుతున్నామని పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు మాణిక్యాలరావు తెలిపారు. మండలంలోని వెలగవాడలో చేపడుతున్న పశుగణన కార్యక్రమాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, డివిజన్ పరిధిలోని పాలకొండ, వీరఘట్టం మండలాల్లో ప్రస్తుతం పశుగణన జరుగుతోందన్నారు. పాలకొండ మండలంలో 19,200 ఇళ్లకు సర్వే చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 810 ఇళ్లకు సర్వే పూర్తి చేశామని.. వీరఘట్టం మండలంలో 13,306 ఇళ్లకు గాను 533 ఇళ్లల్లో సర్వే జరిగిందన్నారు. 34 మంది సిబ్బంది, ముగ్గురు సూపర్‌వైజర్ల ఆధ్వర్యంలో పశుగణన జరుగుతోందని చెప్పారు. 10 రకాల పశువుల లెక్కింపు జరుగుతోందని తెలిపారు.

15న బిర్సాముండా జయంత్యుత్సవాలు



మాట్లాడుతున్న ట్రైబల్ రైట్స్ ఫోరం నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్న తొలి ఆదివాసీ ఉద్యమకారుడు బిర్సాముండా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు, జిల్లా అధ్యక్షుడు ఇంటికుప్పల రామకృష్ణలు కోరారు. ఇదే విషయమై వారు ఆ సంఘం గౌరవాధ్యక్షుడు డి.సురేష్, సహాయ కార్యదర్శి తిరుపతిలతో కలిసి విలేకరులతో సోమవారం మాట్లాడారు. బ్రిటిష్ వారిపై బిర్సాముండా అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు ప్రదర్శించడం జరుగుతుందన్నారు. అలాగే ఆదివాసీల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రముఖులతో ప్రసంగాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. వీటితో పాటు ప్రస్తుత రోజుల్లో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ రూపొందించి, వాటిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలి

గుమ్మలక్ష్మీపురం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 3, 2 సెంట్ల చొప్పున ఇళ్లస్థలాలు కేటాయిస్తూ, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి ఇవ్వాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గరుగుబిల్లి సూరయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పలువురు వ్యవసాయ కార్మికులతో కలిసి పలు డిమాండ్‌లతో కూడిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేదలకు గ్రామాల్లో ఒకటిన్నర సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున ఇళ్లస్థలాలు కేటాయించి, పట్టాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.

అయితే ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మాత్రమే ప్రకటించడంతో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తిచేసుకోలేకపోయాన్నారు. ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున ఇళ్లస్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారని, అంతేకాకుండా అధికారం చేపట్టాక ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు చొప్పున అందిస్తామన్నారన్నారు. ఆయా హామీల సాధనే లక్ష్యంగా ఈ నెల 18వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాల వద్ద వినతిపత్రాలు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు.

పరామర్శ



మధుసూదనరావును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: వైఎస్సార్ సీపీ కార్యకర్త ఎప్పరిక మధుసూదనరావు, ఆయన కుటుంబ సభ్యులను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి పరామర్శించారు. మధుసూదనరావు ఎనిమిది నెలల కొడుకు అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందగా, విషయం తెలుసుకున్న ఆమె.. సోమవారం ఉదయం ఆయన స్వగ్రామం వెళ్లి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఎంపీపీ కుంబురుక దీనమయ్య, జెడ్పీటీసీ మండంగి రాధిక, వైస్ ఎంపీపీ నిమ్మక లక్ష్మణరావు, సర్పంచ్ తాడంగి తులసమ్మ, వైస్ ఎంపీపీ అభిమన్యు, ఎంపీటీసీ సభ్యురాలు ఆరిక భారతి, ఎస్.కృష్ణ, పి.మహేష్, పి. తిరుపతిరావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలను తరలించాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పార్వతీపురంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను కురుపాంలోని నూతన భవనాల్లోకి తరలించాలని గిరిజన విద్యార్థి సంఘం, గిరిజన అభ్యుదయ సంఘం నాయకులు పల్ల సురేష్, ఆరిక చంద్రశేఖర్, ఊలక భూషణ్‌లు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారు కురుపాంలోని విలేకరులతో సోమవారం మాట్లాడారు. పార్వతీపురంలో ప్రస్తుతం పాఠశాల నిర్వహిస్తున్న భవనాల్లో పూర్తిస్థాయి సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్మాణంలో చివరి దశలో ఉన్న కురుపాంలోని భవన నిర్మాణాలను తక్షణమే పూర్తి చేసి, విద్యార్థులకు ఇక్కడికి తరలించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులకు ఆర్థిక సాయం అందజేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

పాలకొండ: ఎన్నికల మందు ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రైతులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించాలని రైతు సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బాలమురళీకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం రైతు సంఘ నాయకుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ, ఎన్నికలర హామీ ఇంతవరకు అమలు చేయకపోవడం సరికాదన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి రైతులకు సాగునీరు అందించాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయోత్పత్తుల విక్రయాలు



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీడీవో సాల్మన్‌రాజు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు సోమవారం చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండించిన వంగ, బెండ, దొండ, చిక్కుడు, బీరకాయలతో పాటు ఆకుకూరలు, రాగులను కార్యాలయ సిబ్బంది కొనుగోలు చేశారు. ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటలు చాలా ఆరోగ్యకరమైనవని, ఒక్క సేంద్రియ ఎరువులను వినియోగించి పండించడం ద్వారా వాటితో మెరుగైన ఆరోగ్యం పొందగలమన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎఫ్ క్లస్టర్ కో–ఆర్డినేటర్ కె.భూషణరావు, ఎంటీలు జి.నిర్మలాదేవి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

వీరఘట్టం: ఈనెల 5న ఇంటిలో దీపాలు వెలిగిస్తుండగా చీరకు నిప్పంటుకుని తీవ్ర గాయాలపాలైన ఖండాపు నర్సమ్మ (70) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. మండలంలోని హుస్సేనుపురం గ్రామానికి చెందిన ఈమె నాగులచవితి రోజున ఇంటిలో దీపం వెలిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకోవంతో గాయపడింది. వెంటనే ఈమెను వైద్య చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌లో జాయిన్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్.ఐ తెలిపారు. మృతురాలి కుమారుడు భుజంగరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రాజెక్ట్ వద్ద ఇసుక తవ్వకాలు తగవు

భామిని: మండలంలోని కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానల్‌లో పేరుకుపోయిన ఇసుక మేటలు తొలగించి ఉచితంగా పంపిణీ చేయడానికి చేసిన ఏర్పాట్లు పక్కదారి పడుతున్నాయని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం ఆరోపించారు. ఈ మేరకు కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానల్‌కు అనుబంధంగా ఉన్న వంశధార నదీ గర్భంలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్న తీరును సోమవారం విలేకరులకు చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైడ్ వియ్యర్‌లో సిల్ట్ తొలగింపు నిలిపి వేసి, నదీ తీరంలో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారన్నారు. దీనిపై వంశధార డీఈఈ భవానీశంకర్ స్పందిస్తూ కాట్రగడ–బి ఓపెన్‌హెడ్ చానల్‌లో ఇసుక మేటతో పాటు మట్టి పొరలు ఎక్కువగా ఉండడంతో మేటల తీత నిలిపి వేసినట్లు స్పష్టం చేశారు. జిల్లా అధికారుల అనుమతితో వంశధార సైడ్ వియ్యర్‌కు ఏర్పాటు చేసిన ఎస్కేప్ కెనాల్‌లో పేరుకు పోయిన ఇసుక మేటలు తొలగించి నిల్వ చేసినట్లు వివరించారు.

నిర్లక్ష్యం తగదు

భామిని: రోగులకు సేవలందించే విషయంలో నిర్లక్ష్యం తగదని డీఎంహెచ్ఓ కె. విజయపార్వతి అన్నారు. మండలంలోని భామిని, బాలేరు, బత్తిలి పీహెచ్‌సీలను సోమవారం ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

గరుగుబిల్లి: పీహెచ్‌సీల్లోని రోగులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బృందం ప్రతినిధి వి.ప్రతిభ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీతో పాటు రావివలస పీహెచ్‌సీని ఆమె సోమవారం సందర్శించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలు, మందుల నిల్వలపై ఆరాతీశారు. కార్యక్రమంలో రాష్ట్ర కన్సల్టెంట్ శ్రీకాంత్, వైద్యుడు సాగర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ స్టేట్ యూనిసెఫ్ వైద్య బృందం(విజయవాడ), వైద్యుడు విక్రమ్ రెడ్డి సోమవారం సందర్శించారు. ఆస్పత్రిలోని మందులు, బ్లడ్‌బ్యాంకు, ఆక్సిజన్ ప్లాంట్, వార్డు రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. రోగులకు అందిస్తున్న వైద్యసేవలను సూపరిండెంట్ డాక్టర్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు సందీప్, సునీల్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ జయగౌడ్ ఉన్నారు.

ప్రసవాలు మరింతగా పెరగాలి..

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరగాలని మాతా,శిశు సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు ఏవీఎస్ఎస్ అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని అన్నవరం, ఎం.సింగుపురం పీహెచ్‌సీలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్‌లు, మందుల రికార్డులు పరిశీలించారు. ఈయన వెంట జిల్లా ప్రొగ్రామింగ్ అధికారి జగన్ మోహనరావు, వైద్యాధికారులు వి.కమల్‌నాథ్, ఎస్.రవికుమార్, సిబ్బంది ఉన్నారు.

వైద్యసేవలపై ఆరా

కొమరాడ: కూనేరు రామభద్రపురం, కొమరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను రాష్ట్ర ప్రొగ్రాం(గిరిజన సంక్షేమ శాఖ) అధికారి డాక్టర్ ఎం.రమేష్‌బాబు తమ బృందంతో కలిసి సోమవారం సందర్శించారు. అనంతరం వారు ఆయా ఆస్పత్రుల్లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. సంబంధిత రికార్డులు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కొమరాడ ఆస్పత్రి ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలని ఆదేశించారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని దళాయివలస గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సోమవారం సందర్శించి, రికార్డులతో పాటు సిబ్బంది విధుల నిర్వహణ, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందజేస్తున్న పౌష్టికాహారం దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, నాయకులు జి.శ్రీనివాసరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల తనిఖీ

వీరఘట్టం: మండలంలోని బిటివాడ, వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అధికారుల బృందం సోమవారం తనిఖీ చేసింది. వీరఘట్టం పీహెచ్‌సీని ఐడీఎస్‌పీ జాయింట్ డైరెక్టర్ మల్లీశ్వరి, జిల్లా మలేరియా నివారణ అధికారి హేమ, రాష్ట్ర మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్ సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. అలాగే బిటివాడ పీహెచ్‌సీని ఎంసీహెచ్ అడిషనల్ డైరెక్టర్ కేవీఎస్ఎస్ అనిల్‌కుమార్, రాష్ట్ర మెటర్నల్ హెల్త్ కన్సల్టెంట్ డాక్టర్ జి.ప్రహరహ, రాష్ట్ర ఐటీ కన్సల్టెంట్ రావి వెంకటేష్, జిల్లా ప్రొగ్రాం అధికారి టి.జగన్‌మోహన్‌రావు సందర్శించారు.